# వారసుడు

వెంకట్రామయ్య గొడ్లపాకముందు బాదంచెట్టు నీడలో నిలబడి నాలుగువైపులా తృప్తిగా చూచాడు. అప్పుడే విడిచిపెట్టిన దూడలు ఆత్రంగా పాలు కుడుస్తున్నాయి. గోమాతల కళ్ళల్లో సంతృప్తి సంతోషం కన్పించాయి. ఆయనకు, తనకు కలిగిన అతృప్తి విషయం జ్ఞాపకం వచ్చింది. అప్రయత్నంగా ఇంటివైపు చూచాడాయన. ఎదురుగా, దూరంగా అరుగుమీద భార్య కన్పించింది.

పార్వతమ్మ ఒకసారి భర్తవంక చూచింది.

'మగవాడు ఇంత అందగాడు కావడం ఒకరకంగా ప్రమాదమే. కాని నా అదృష్టం బాగుంది' అనుకొని ఆవిడ చిరునవ్వు నవ్వుకొంటూ నెమ్మదిగా లోపలికి వెళ్ళింది. మళ్ళీ అంతలో అక్కడకు తిరిగివచ్చి "శాంతా ఇక్కడే ఉన్నావా, త్వరగా వచ్చి చల్లచెయ్యి. ముందు కాఫీ కలిపి ఇవ్వు" అన్నది.

తులసికోటచుట్టూ ముగ్గులువేస్తున్న శాంత నెమ్మదిగా లేచి నిలబడి చేతులు దులుపుకొని "ఇదుగో వస్తున్నానండీ" అన్నది. అందుకు పార్వతమ్మ "అండి ఏమిటి- కొండి ఈ నాగరికాలు నచ్చవు నాకు. నరే ముందు పనికానీ" అన్నది.

శాంత తలవంచుకొని మెల్లగా అడుగులో అడుగువేసుకొంటూ ఒయారంగా ముందుకు నడిచింది. శాంత దగ్గరకు వచ్చాక ఆవిడ నవ్వుతూనే "అదుగో, ఆ ఒయ్యారమే వద్దన్నాను. గబగబా నడు" అన్నది.

శాంత లోపలకు వెళ్ళింది.

వెంకట్రామయ్య నెమ్మదిగా అరుగుదగ్గరకు వచ్చి "ఏమిటి అంటున్నావ్" అన్నాడు. "ఏంలేదు. ఈపాటికి పెళ్ళిచేస్తే ఎంతమంది కలిగేవారో- అన్నాను." అన్నది ఆయనభార్య. అందుకు ఆయన నవ్వుతూ "మరి అలాఅయితే- ఎప్పడో అయిందిగా నీకు- ఎంతమంది కలగవలసింది" అన్నాడు.

పార్వతమ్మ ఒకసారి భర్తవంక కోపంగా చూచి చప్పున వెను తిరిగి పెద్దపెద్ద అంగలువేసుకొంటూ హడావిడిగా లోపలకు వెళ్ళింది. ఆవిడ ఒకసారి ఇంటిముందుకు వెళ్ళి మళ్ళీ లోపలకు వచ్చి ఆయాస పడుతూ "ఏమే శాంతా, గుమ్మంముందు ముగ్గువెయ్యాలని కూడా తెలియదా ?" అన్నది పెద్దగా.

శాంత ప్రక్కగదిలోనుంచి నెమ్మదిగా అక్కడకువచ్చి "అలాగే" అని వీధిగుమ్మంవైపు వెళ్ళింది. అలా వెళుతూ వెంకట్రామయ్య చూపులు తన్ను వెంటాడుతున్నాయని శాంత అనుమానించింది.

పార్వతమ్మ అరుపులు పురమాయింపులు శాంతకు క్రొత్తేమీ కాదు. ఆమెకు మరీ క్రొత్తగా కన్పిస్తున్నదల్లా వెంకట్రామయ్య పోకడే.

* * *

"అమ్మా, ఇంక నేను ఇక్కడ ఉండనే. రేపో ఎల్లుండో నేను మళ్ళీ తాతయ్యగారి ఊరు వెళ్ళిపోతాను" అన్నది శాంత- తల్లి ప్రక్క మీద కూర్చుంటూ. అప్పటికే ప్రొద్దుపోయింది. శాంతతల్లి నాగమ్మ అప్పుడే నడుంవాల్చింది. ఆవిడ కూతురువీపు నిమురుతూ "ఎందు కమ్మా అలా అంటున్నావ్. ఏం పార్వతమ్మ పనులు ఎక్కువ చేయి స్తున్నదనా ? నాకు మళ్ళీ కొంచెం ఓపికరానీ- సగంపనులు నేనేచేస్తాను.

అక్కడమాత్రం నీకు ఎవరున్నారు. తాతయ్య ఉన్నంతకాలం ఏదోలా కష్టపడుతూ అక్కడ గడిపావు. ఇక నీకు ఇక్కడ తప్పదు. ఆవిడ అలా అరుస్తుందేకాని చెడ్డమనిషికాదు. నాకు అన్నాళ్ళు జబ్బుచేసి లేవ లేకపోతే ఎంతో సహాయం చేసింది. 'పెద్దమ్మా, నువ్వు మందు తాగావా' అంటూ ఈ పాకలోకి రోజూ కనీసం ఒక్కసారిఅయినా వచ్చివెళ్ళేది, ఆ రెండునెలలూ. మన బ్రతుకంతా వాళ్ళమీదే ఆధారపడి ఉంది. దిక్కు లేక ఇక్కడకు చేరినప్పటినుంచీ నన్ను ఆవిడే ఆదుకొన్నది. మీ తాతయ్య నిన్ను పెంచాడూ- అంటే అదంతా ఆవిడ చలవే. నీకు ఓ అక్షరంముక్క అబ్బిందీ అంటే- అందుకు కారణం ఆవిడే. చెడి పోయిన మనిషినీ, ఆ మనిషి కూతురునూ ఇంతగా ఎవరు ఆదరిస్తారే? మనం ఆవిడకు కృతజ్ఞత చూపాలి, ఆవిడ ఏమన్నా పడాలి. ఏ పని చెప్పినా చెయ్యాలి ఈ మాత్రం పైపనులు చెయ్యడానికే నీకు కష్టమైతే ఎలా?"

"అదికాదే, ఆవిడ పనులు చేయిస్తున్నదనీ, సాధిస్తున్నదనీ నేను బాధపడడంలేదు కాని ఆయన..." అని ఆగింది శాంత. అందుకు వెంటనే ఆవిడ అందుకొని 'ఛఛ. ఆయన్నుగురించి ఏమీ చెప్పకు. ఆయన అన్నివిధాలా యోగ్యుడు. ఊరంతా తరిమికొడితే ఇక్కడ చేరాను. దొడ్లో ఈ పాకవేయించి ఇచ్చాడు. ఎవరిబాధా లేకుండా నిన్ను అక్కడ పెంచీ పెద్దదాన్ని చేయడానికి సహాయం చేశాడు. ఆవిడతో మన బంధుత్వం ఏపాటిది? కేవలం ఆయనవల్లనే నా బ్రతుకు ఇలా ఇన్నాళ్ళూ నిశ్చింతగా గడిచింది. వాళ్ళమీద నేరాలు చెప్పకు. సంతానం కలగలేదని వాళ్ళ ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి కోపం. ఆ కోపం అప్పు డప్పుడు వారిమీదా వీరిమీదా చూపిస్తుంటారు. ఇవన్నీ నీకు చెప్పినా తెలియవులే. ఇంక నువ్వెళ్ళి పడుకో." అని నాగమ్మ మరోవైపు తిరిగి

పడుకున్నది. శాంత అక్కడనుంచి లేచివెళ్ళి, ప్రక్కవేసుకొని పడుకొన్నది.

'ఆయన అలా చేస్తాడనుకో లేదు.' అనుకొన్నది శాంత ఒకటికి రెండుసార్లు.

పదిరోజులుగా ఆయన తన్ను చూపులతో వేధించడం జరిగింది. ఏమిటో- అనుకొన్నది. ఏవరూ చూడనప్పుడు ఆయన యథాలాపంగా తన ఒంటిమీద చేయివెయ్యడం, తను సిగ్గుపడడం, తర్వాత రెండు మూడుసార్లు మృదువుగా చెక్కిళ్ళు స్పృశించడం, తను చలించడం కూడా జరిగింది. మురిసిపోవడం, మునిముని నవ్వులు నవ్వడం ఎందుకో మొదట అర్థంకాలేదు. కాని తర్వాత తర్వాత అర్థం అయింది కాని తను ఏమీ అనలేదు ఎందుకో ప్రతిసారీ భయంవేసింది. ఒళ్ళు కంపించింది. అంతలో పులకరించింది. క్రొత్తగానూ ఉన్నది. మనసు మనసులో లేకుండానూ పోయింది. కొన్నిసార్లు వారిద్దామని గట్టిగా అనుకొన్నది. ఎలా వారించాలో తెలియకపోయింది. ఏమంటే ఏమవుతుందో అనీ, ఎవరికి తెలిస్తే ఏమంటారో అనీ భయపడి ఊరుకొన్నది. ఊరుకోక తప్పదని అనిపించింది.

అంతలో అనుకోకుండా ఇలా జరిగింది.

ఆరోజు రాత్రి తొమ్మిది గంటలకు ఆయన ముందుగదిలో పట్టె మంచంమీద పడుకొన్నాడు. రోజూ ఆయన అక్కడ కాసేపు విశ్రమించి, శాంత పనులు ముగించి పెరట్లోకి వెళ్ళాక పైకి వెళతాడు. ఆయనభార్య ఎనిమిది కాగానే పైకివెళ్ళి పడుకొంటుంది. రోజూ పైకి వెళ్ళేముందు గ్లాసునిండా పాలుతాగి వెళ్ళడం ఆయనకు అలవాటు. అలా పాలు శాంత ఇవ్వాలి.

రోజూలాగానే పాలగ్లాసు మంచంప్రక్కన బల్లమీదపెట్టి వెళ్తుంటే ఆయన నెమ్మదిగా 'శాంతా' అని పిలిచాడు.

శాంత వెనుతిరిగి చూచింది.

వెళ్ళిపోతున్న వసంతం వెనుతిరిగి చూచినట్టు అనిపించింది- వెంకట్రామయ్యకు. దగ్గరకు రమ్మని సంజ్ఞచేశాడు. వచ్చిన మరుక్షణంలో ఆయన శాంతచెయ్యి గట్టిగా పట్టుకొని 'కోపమా' అన్నాడు.

శాంత మారుమాటాడలేదు. తలవంచుకొన్నది; సిగ్గుతో తల దించుకొనిపోయింది. భయంతో వణికిపోయింది. అంతలో ఆయన శాంతను ఒక్కవేటున హఠాత్తుగా తనపైకి లాక్కొని గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. ఎడంచేయి నడుముచుట్టూ పెనవేసి కుడిచేత్తో మెడమీద నొక్కుతూ, ముఖం ముందుకు లాక్కొని ఆమెను ఉక్కిరిబిక్కిరిచేస్తూ గట్టిగా చాలాసేపు అధరాలను చుంబించాడు. ఆవేశంలో తన్నుతాను మరచిపోయి పెదిమలపైనా, నుదుటిపైనా, వక్ష ఉపరిభాగంపైనా మళ్ళీమళ్ళీ గట్టిగా ముద్దు పెట్టుకొన్నాడు.

ముద్దుల జడివాన వెలిశాక ఆయనకు ఆవేశం కొంతతగ్గింది. బిగి కౌగిలి సడలింది కూడాను.

శాంత తెప్పరిల్లుకొన్నది.

ఆమె చప్పున ఆయన కౌగిలినుంచి తప్పించుకొని గబగబా బయటకు వెళ్ళింది. ఆయన అక్కడే నిలబడిపోయాడు.

* * *

శాంత పెదిమలను మునివళ్ళతో గట్టిగా నొక్కుకొన్నది.

ఎంత సాహసం!

తలుపులు తెరిచే ఉన్నాయి.

ముందు పెరట్లో పనివాళ్ళు తిరుగుతూనే ఉన్నారు. మేడపైన పార్వతమ్మగారు మేల్కొనే ఉన్నది. ఎవరు ఏక్షణంలో అయినా ఆ గది లోకి రావచ్చును. కాని ఎవరూ పిలిస్తేనేకాని రారు అదీ ఆయన పిలిస్తేనే. తను పిలిస్తే రాకపోవచ్చు. ఆ విషయం తనకూ తెలుసు.

'అదే ఆయన ధైర్యం కాబోలు' అనుకొన్నది శాంత. మళ్ళీ అంతలో 'అబ్బే, కాని... ఇలా జరుగుతుందని అనుకోలేదు' అను కొన్నది. ప్రక్కకు ఒత్తిగిలి పడుకొంటూ. కళ్ళు గట్టిగా మూసుకొని తల్లికి ఫిర్యాదుచేసినా ప్రయోజనం లేకపోయిందే- అని ఎంతోసేపు మధనపడ్డది శాంత. ఆమె తల్లిచెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకొన్నది. తల్లి హితబోధ బోధపడలేదు శాంతకు. ఆమెకు మరో మార్గాంతరం కూడా కన్పించలేదు. 'ఇందులో నా దోషం మాత్రం లేదా' అని ఒకటి రెండుసార్లు తన్నుతాను ప్రశ్నించుకొన్నది. తోచిన సమాధానం ఆమెకు బొత్తిగా నచ్చలేదు. విసుక్కొంటూ శాంత మరోప్రక్కకు తిరిగి పడు కొన్నది. అంతలో మళ్ళీ ప్రక్కలో అటూఇటూ మసలి బొక్కబోరలా పడుకొని కళ్ళు గట్టిగా మూసుకొన్నది.

శాంతకు ఆ రాత్రి ఎప్పటికోగాని నిద్రపట్టలేదు.

* * *

'పార్వతమ్మ నలతగా ఉండడానికి కారణం అదికాదని నిన్న ఆ డాక్టరు చెప్పివెళ్ళాడట గాని నిజమేనా శాంతా, ఆవిడ నీకేమైనా చెప్పిందా? ఈ పదిరోజులనుంచీ ఆవిడకు సేవలుచేస్తూ నువ్వు ఆవిడ దగ్గర చనువు సంపాదించినట్టున్నావ్; అడగలా?' అన్నది నాగమ్మ.

'ఎలా అడగను. నాకు సిగ్గుకాదమ్మా. కాని ఆవిడే చెప్పింది. ఇది అదే అయితే తనూ ఆయనా ఎంతో సంతోషించే వారమనీ, దాని ఆ అదృష్టం తమదేననీ, పైగా ఈ ఉదరవ్యాధి మూలంగా తమకు

తీరని అశాంతి కలుగుతున్నదనీ చెప్పకొని ఎన్నోసార్లు కంట తడి పెట్టింది. ఆయన ధోరణి ఇలాగే ఉన్నది. ఏమిటో వీళ్ళగొడవ నాకేం అర్థం కావటంలేదు' అన్నది శాంత.

శాంతకు బాగా అర్థం అయిందని నాగమ్మ నిర్ధారణ చేసు కొన్నది- మనసులో. ఆవిడ అంతలో ఆ విషయం మార్చి 'అది సరే కాని శాంతా, నువ్వు ఇవ్వాళ సాయంత్రం వీధిలోకి వెళ్ళి ఎవరితోనో మాటాడివచ్చావు కదూ ? ఎవరతను. నీ అంతట నువ్వే చెబుతావనుకొని అడగలేదు.' అన్నది. అందుకు శాంత సమాధానం చెప్పలేదు. ఆవిడ మళ్ళీ అడిగింది. "అవునే శాంతా- నాకు చెప్పకూడదా ? అతను నిన్నా మొన్నాకూడా వచ్చివెళ్ళాడు. ఇందాక పార్వతమ్మ నాతో అన్నది. అతన్ని ఆవిడ చూచిందట. నువ్వు అతగాడితో అంత సేపు మాటాడి రావలసిన అవసరం ఏమి వచ్చిందనీ, నేను వెనకఉండి చేయ వలసిన పని ఇదేనా అనీ సూటిపోటుమాటలు అన్నది. సరే ఇంతకూ అతను ఎవరు ;" అన్నది రెట్టిస్తూ.

శాంత నెమ్మదిగా 'ఇందులో అంత దాపరికం ఏమీలేదమ్మా. తాతయ్యగారి ఇంట్లో ఉండగా పరిచయం అయింది. అతనే కావాలని నాతో పరిచయం చేసుకొన్నాడు. అఊరే అతనిది. వాళ్లది మంచి కుటుంబమేనట. ఈ ఊళ్లో ఎవరో బంధువులు ఉన్నారని వచ్చాడు' అన్నది.

'అంతేనా ?' గద్దించి అడిగింది నాగమ్మ.

'కాదు- అతను నన్ను ప్రేమిస్తున్నాడు'

'సరే. సరే ఇంకేం, ఊఁ తర్వాత ?'

కాలంనాడు నాగమ్మ కూడా ఈమాటే అన్నది - తండ్రితో. ఇరవై ఏళ్ళనాటి సంగతులు అన్నీ ఒకసారి జ్ఞాపకం వచ్చాయి. ఆవిడ

కళ్లవెంట నీళ్లు తిరిగాయి ఆనాడు తండ్రి తన్ను బుజ్జగిస్తూ అన్న మాటలు జ్ఞాపకం చేసుకొన్నది. అంతలో- అప్పుడాయన కరుగ్గాఉంటే తన జీవితం ఎలా వుండేదో ! తండ్రి నిర్ణయించిన సంబంధం కాదని తనకు నచ్చాడనుకొన్న వ్యక్తితో, ఇల్లువిడిచి వెళ్ళిన నాటినుంచి పడిన కష్టాలన్నీ స్ఫురణకు వచ్చాయి. ఆవిడకు ఎంతో బాధకలిగింది. అలా బాధపడుతూనే ఆవిడ 'ఏమే అడిగినదానికి సమాధానం చెప్పవేమే?' అందుకు శాంత మరోవైపు చూస్తూ 'ఏం చెప్పమంటావే?' అన్నది

నాగమ్మ కొంచెం పెద్దగా 'ఇంకేం? అతగాడివలలో వడ్డావన్న మాట. అటు తాతయ్యకూ, ఇటునాకూ తెలియకుండా నువ్వే వ్యవహారం నడుపుతున్నావన్నమాట. అవునా? అవున్లే! చెడిపోయినదాని కూతురు ఇంతకంటె మరేం చేస్తుంది. నిన్నుఅని లాభంలేదు.' అన్నది కోపంగా. అందుకు శాంత 'ఏమిటే అమ్మా, మాటి మాటికీ ఆ మాటే అంటావ్ ఎందుకూ - నువ్వే దప్పు వేసుకొంటావ్, తెలియని వాళ్ళకు కూడా తెలియడానికా?" అన్నది. నాగమ్మ కూతురు చెయ్యిపట్టుకొని 'ఎందుకు తెలియవమ్మా. తెలుసు ఇట్లాంటివి దాగవు. పైగా బీదవాళ్ల విషయాలు అసలు దాగవు. దాగుతాయని భ్రమపడతాం; అది భ్రమ- అని తెలిసి పోయిన తర్వాత మొండిగా, నిర్భయంగా ప్రవర్తిస్తాం. కాని సంఘం కళ్లు మూసుకుపోలా. వాళ్లతో మనకేంపని అని మనమే కళ్లు మూసు కొంటాం. స్వేచ్ఛగా వ్యవహరిస్తాం. మనం మళ్లీ కళ్లు తెరిచేసరికి ఎక్కడో, అఘాతంలో వుంటాం. ఊబిలో దిగబడి ఉంటాం. అప్పుడు మన్ని ఉద్ధరించడానికి ముందుకు రాలేదని వారినీ వీరినీ ఆడిపోసు కొంటాం. వాళ్లు మరింతదూరం అవుతారు. నా సంగతి అలానే అయింది తల్లీ' అంటూ దుఃఖం ఆపుకోలేక పెద్దగా ఏడ్చింది. శాంత తల్లిని ఊర డించడానికీ ఆమె అంత బాధపడ వలసిన విషయం ఏమీలేదనీ, దోషం

ఏదీ జరగలేదనీ, నిజంచెప్పి నమ్మించడానికీ విశ్వప్రయత్నం చేయ వలసి వచ్చింది.

నాగమ్మ ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

'ఏమిటీ మనిషి అతను మాటాడి వెళితేనే ఇంత అనుమానపడి, ఆరాలుతీసి నాకు తెలియకుండా అతనితో, అతనికి తెలియకుండా నాతోనూ మాట్లాడి ఇంత ఆర్భాటం చేసిందే- మరి వెంకట్రామయ్య తనతో చనువుగా ఉండడం, తనకు మంచి చీరలు కొనిఇవ్వడం, కాను కలు ఇవ్వడం స్వయంగా చూచికూడా ఏమీ అనదేం? పార్వతమ్మగారు మాత్రం ఈ విషయం పసిగట్టి ఉండదా? నాకోసం అతను అల్లావచ్చి వెళితే ఇంత అనుమానపడ్డ మనిషి తనభర్త నావట్ల చూపుతున్న వ్యామోహం అర్థం చేసుకోలేదా? ఎన్నో కల్పించి తల్లితో చెప్పదా? చెబితే మరి ఈ మనిషి ఏమీ అనదేం? అది తప్పుఅయితే ఇదీ తప్పేగా.' అని శాంత ఎంతోసేపు మధనపడ్డది.

*　　　*　　　*

'నువ్వు ఈ రహస్యం అతనికి చెప్పకుండా ఉండవలసింది' అన్నది శాంత గునుస్తూ.

'ఏమీ?' అన్నది నాగమ్మ.

'ఏమా- అతనింక నాముఖం చూడడు.'

'చూడకపోవడమే మంచిది. అయినా ఏమిటి నువ్వనేమాట. ఇక్కడ వెంకట్రామయ్యతో వ్యవహారం ఇంతదూరం వచ్చాక మళ్ళీ నీకు అతని విషయం ఎందుకు ఆలోచనవచ్చిందీ? తప్పుకాదూ_ సంతానవతివి కాబోతున్నావ్! నీకీ కుర్రతనపు మాటలు పనికిరావు-' అన్నది నాగమ్మ నెమ్మదిగా మందలిస్తూ.

'శాశ్వతంగా ఇక్కడే ఈ రహస్య జీవితం గడపాలనిలేదు నాకు' అన్నది శాంత.

'నీ మాటలు అర్థం కావడంలేదు. నీకు ఇష్టంలేకుండా ఆయనతో వ్యవహారం ఇంతదూరం వస్తుందని నేను అనుకోను. ఇష్టం లేకపోతే ముందే తప్పుకోవలసింది. మెడలువంచి నిన్నిందుకు ఇక్కడ ఎవరూ ఒప్పించలేదు. నువ్వు చాలా అసహ్యమైన ఊహచేస్తున్నావు. ఇక్కడ, కనివెళ్లి అతన్ని పెళ్లాడదామనుకొంటున్నావు. ఇటువంటివి ఎప్పుడూ దాగవు. ఒకవేళ అతిప్రయత్నంమీద దాచిపెట్టి అతన్ని పెళ్లాడినా- ఏనాడో ఒకనాడు ఈ విషయం బయటపడుతుంది. నిజం చెప్పమని అతను నిన్ను రాచి రంపానపెడతాడు. నిజం చెప్పాక నిన్ను బయటకు గెంటుతాడు. అదంతా అలాఉంచు. ముందతను నిన్ను పెళ్లిచేసుకుంటాడా? పూర్వం మొట్టమొదటిసారిగా నాకంట బడ్డప్పుడు అతన్ని నేను అనునయించి- మా అమ్మాయిని నువ్వు పెళ్లిచేసుకుంటావా- అని అడిగాను. అతను- నాగమ్మ కూతురు అని తెలిసి- మానాన్న ఒప్పుకొంటాడా? అని ఎదురు ప్రశ్న వేశాడు; అవును- ఒప్పుకోడు. కాని అతను ముందే ఇవన్నీ ఆలోచించుకోవద్దూ? నాముందే ఎంతమాట అన్నాడే! అతని వాలకంచూస్తే నిన్ను ఏలుకొనేవాడులా కన్పించలా. ఎవరి దగ్గరో... అబ్బే నే నామాట అననులే; 'అడుక్కుతినేవాడి ఆలిఅయ్యేకంటే' అని ఆగింది నాగమ్మ- కూతురుముఖం జేవురించడం గమనించి.

రెండుమూడు నిముషాల తర్వాత నాగమ్మ కూతురును బుజ్జగిస్తూ 'శాంతా, నువ్వు కోపం తెచ్చుకోకు; అనవసరంగా మనసు కష్టపెట్టుకోకు. ఆనాడు నేను అలా అడిగానని వెళ్లిపోయాడతను. నిజంగా ప్రేమవున్నవాడు అలా చేస్తాడా? ఆనాటి విషయం పోనీ, ఈనాడు ఏమైంది? మళ్లీ ఆరునెలలకు వచ్చాడు. ముందు నేను మర్యాదగా మాట్లాడాను. నీ భవిష్యత్తు పాడుచెయ్యవద్దని బతిమిలాడాను.

కాని అతని ధోరణి ఏమీ మారలేదు. పూర్వం అన్నమాటే అన్నాడు. పూర్వంనుంచీ నీతో అక్రమ సంబంధం ఉన్నదని ఇక్కడ అందరితో చెప్పి అల్లరి పెడతానన్నాడు. నన్ను అడ్డుతొలగమన్నాడు. పుస్తైకట్టి అలాగే తీసుకుని వెళ్ళు నేను అడ్డు తొలుగుతాననే అన్నాను. కాని నిర్భయంగా చెబుతున్నాడు- నిన్ను లేవతీసుకొని వెళతానని. ఇక్కడ నీకూ, నాకూ దిక్కెవరున్నారు? అప్పుడు గత్యంతరంలేక నీకు నెల తప్పిందని అన్నాను. నీయందు నిజంగా ప్రేమకలవాడైతే ఆ మాట అంత వెంటనే నమ్మడు. పైగా ఎంతో బాధపడతాడు- అదేమీలేదు. వీధినిపడి నిన్నూ, నన్నూ కలిపితిట్టాడు. అతని తిట్లు విని పార్వతమ్మ పాలేరును పంపింది. అతను పాలేరునూ తిట్టాడు. ఇంతలో, వెంకట్రామయ్య బయటకు వచ్చాడు. ఆయన్ను చూచి అతను పరుగు లంకించుకున్నాడు. నేను లోపలకు వచ్చాక పిళ్ళతో, ఈ విషయం అంతా చెప్పవలసివచ్చింది. ఆవిడ నీకు తగిన రక్షణ ఇస్తానన్నది; ఆయన నాతో రహస్యంగా అన్నీ మాట్లాడాడు నిన్ను పెళ్లిచేసుకొన్నట్లే అన్నాడు, ఇవుగో, నగలు. ఇదుగో డబ్బు. ఇదుగో ఆయన వ్రాసిఇచ్చిన కాగితం. ఇంతదాకా అక్కర్లేదు ఆయన చేసిన వాగ్దానం చాలు; ఇందుకు ప్రభుత్వం ఒప్పుకోదు కాని మనశాస్త్రం ఒప్పుకొంటుందట. రెండో పెళ్లివాడికి పిల్లను ఇచ్చా ననుకొంటాను. సంతానం కోసం ఆయన నిన్ను స్వీకరించా ననుకొంటున్నాడు. ఇక నీకేం భయంలేదు. అంతే కాదు; ఆవిడకు ఆరోగ్యం చక్కబడ్డాక ఈ విషయం అంతాచెప్పి ఒప్పిస్తానన్నాడు. ఆవిడ ఒప్పుకొంటుంది; ఆ నమ్మకం ఆయనకూ ఉన్నది, నాకూ ఉన్నది' అన్నది.

శాంత అంతా విన్నది.

కొంతసేపు మారు మాటాడలేదు.

కూతురుకు కోపం పోయిందనుకుని నాగమ్మ ముందుకువచ్చి నగలు మెడలో వెయ్యబోయింది. శాంత విదలించుకొని తల్లివంక కోపంగా చూచింది. అందుకు నాగమ్మ 'అవున్లే. అమ్మాయి! నీకు కోపంగానే ఉంటుంది. నాకు తెలును. తలిదండ్రులు చేసిన తప్పులు పిల్లలు క్షమించరు. బిడ్డలు చేసిన తప్పులు తలిదండ్రులు క్షమిస్తారు' అన్నది.

శాంత కొంచెం పెద్దగా, కోపంగా 'అయితే ఇదంతా తప్పని తెలిసే చేశావన్నమాట' అన్నది. నాగమ్మ శాంతంగా 'పిచ్చిపిల్లా-నీకెలా తృప్తిగావుంటే అలా అనుకో; కాని ఒక్క విషయం. ప్రస్తుతం నేను ఉన్న పరిస్థితులలో అటు ఆయనకు భయపడి ఇలా చేయలేదు. ఆయన స్వభావం తెలుసు కనుక ఇలా జరగనిచ్చాను. అంతే అంత కన్న నాతప్పు మరేమీలేదు' అన్నది.

శాంత మారు మాటాడకుండా వెనుతిరిగి ప్రక్క గదిలోకి వెళ్లింది.

*  *  *

ఆరోజు వెంకట్రామయ్య అన్నివిధాలా ఆందోళన పడిపోయాడు. భార్యకు ఉదరవ్యాధి పెరిగింది. వెంటనే పట్నం తీసుకొనివెళ్లి శస్త్ర చికిత్స చేయించవలసి వచ్చింది నాగమ్మ వెంటవచ్చి తీరాలని పార్వతమ్మ పట్టుపట్టింది. నాగమ్మ ఇరకాటంలో పడ్డది. కూతురుకు ఏ క్షణంలో అయినా నొప్పులు వచ్చేలా ఉన్నాయి. వెంకట్రామయ్యతో సంప్రదించింది. ఆయన ఉపాయం చెప్పాడు. రెండు టాక్సీలలో బయలు దేరి అరగంటలో, పట్నం చేరారు- వారు నలుగురూ. ముందు భార్యకు శస్త్రచికిత్సకు జరగవలసిన ఏర్పాట్లు పూర్తిచేసి తర్వాత శాంతను ప్రయివేటు ప్రసూతి వైద్యాలయంలో చేర్పించాడు- వెంకట్రామయ్య.

ఆ రాత్రి ఎనిమిది గంటలకే పార్వతమ్మకు శస్త్రచికిత్స జరిగింది. ప్రాణాపాయం తప్పింది. ఆయన ఎంతో సంతోషించాడు

ఆ మరునాడు శాంతకు సుఖంగా కాన్పు అయిందనీ, మగపిల్లవాడు కలిగాడనీ ప్రసూతి వైద్యాలయం నుంచి వెంకట్రామయ్యకు సమాచారం అందింది. ఆయన సంతోషం పట్టలేకపోయాడు. నాగమ్మ కూతురు అదృష్టవంతురాలయింది. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు తీరుబడి చేసుకొని, ఆయన నాగమ్మను వెంటపెట్టుకొని ప్రసూతి వైద్యాలయానికి వెళ్లాడు.

ముందు నాగమ్మ శాంత ఉన్న గదిలోకి వెళ్లింది.

ఇరవై నిముషాల తర్వాత బయట నిలబడ్డ వెంకట్రామయ్యకు పిల్లవాణ్ణి తెచ్చి చూపిస్తూ 'పురిటిస్నానం అయేదాకా శాంత మిమ్మల్ని చూడదట. దానికి సిగ్గుగానూ, ఎందుకో కోపంగానూ ఉన్నది' అన్నది. వెంకట్రామయ్య నవ్వి ఊరుకొన్నాడు. పిల్లవాణ్ణి పొత్తికళ్లలో ఎత్తుకొని 'ఇన్నాళ్లకు నాకు ఇంత అదృష్టం కలిగింది' అన్నాడు.

పార్వతమ్మ దగ్గరకు వెళుతున్నప్పుడు దారిలో నాగమ్మ కూతురు అంటున్న మాటలన్నీ వెంకట్రామయ్యతో చెప్పింది మీ కొడుకును మీకు అప్పగించి తను ఎటైనా వెళ్లిపోతుందట. మీకు తనకంటే కొడుకే ముఖ్యమట. పార్వతమ్మ అయినా పిల్లవాణ్ణి మీ కారణంగా ఆదరిస్తుందిట కాని తన్ను ఆదరించదట. తను మీ యింట్లో ఉండదట. అలా ఉండి ఆవిడకు అన్యాయం చేయలేదట. తన్ను క్షమించమన్నది. ఇంకా ఏమిటో చెప్పింది. అమ్మా నన్ను క్షమించమంటూ వెక్కి వెక్కి ఏడ్చింది. తనకు తండ్రి లేకపోవడంవల్లనే అంతా ఇలా జరిగిందని ఏడ్చింది. తను ఒంటరిగా ఎక్కడికైనా దూరప్రాంతానికి పోయి ఏ శరణాలయంలో అయినాచేరి, కష్టపడి చదువుకొని పైకి రావాలను

కొంటున్నదట. బాగా చదువుకొంటే పెద్దఉద్యోగం వస్తుందట తను స్వతంత్రంగా, హాయిగా బ్రతకడానికి అదే మార్గమట. అది అలా ఎటో వెళ్లిపోతే నేను దిగులుపడి చావవలసిందే.' అంటూ కళ్లు ఒత్తుకొన్నది. 'ఇదంతా నా పాపఖర్మమే. భగవంతుడు నన్ను క్షమించలేదు కాబోలు' అని గొణిగింది నాగమ్మ.

వెంకట్రామయ్యకు కళ్లవెంట నీళ్లు తిరిగాయి. 'శాంత కన్న బిడ్డనూ, నన్నూ, నిన్నూ విడిచిపెట్టి ఎక్కడకు వెళుతుంది. ఊరికే కోపంకొద్దీ, ఏదో అఘాయిత్యంకొద్దీ, తనకేదో అన్యాయం జరిగిపోయినదన్న బాధకొద్దీ అలా అన్నదే కాని మమకారాలు తెంచుకొని పారిపోగలదా? చూస్తా ఎలా వెళుతుందో. ఊఁ వెళ్లనిస్తానా? పిల్లవాడి విషయంలోనే కాదు; శాంత విషయంలో కూడా తండ్రి నిర్వహించవలసిన బాధ్యత అంతా నాదే. ఇంకా ఇరవైఏళ్లకు కాని నేను ముసలివాణ్ణికాను. అప్పుడు ఆడించమనండి' అని కళ్లు గట్టిగా ఒత్తుకుని నాగమ్మవంక తిరిగి కావాలని నవ్వుతూ 'ఏం ఈమాట చెబుతావా?' అన్నాడు వెంకట్రామయ్య.

---